ఉప్పు, చక్కెరలోనూ మైక్రోప్లాస్టిక్స్

న్యూఢిల్లీ, ఆగస్టు 13: చిన్నాపెద్ద, ప్యాకేడ్, అన్‌ప్యాకేడ్ అన్న తేడాలే కుండా ఇండియాలో దొరికే అన్ని ఉప్పు, చక్కెర బ్రాండ్లలో మైక్రోప్లాస్టిక్స్ ఉన్నాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. మంగళవారం టాక్సిక్స్ లింక్ అనే పర్యావరణ హిత సంస్థ విడుదల చేసిన 'మైక్రోప్లాస్టిక్స్ ఇన్ సాల్ట్ అండ్ షుగర్' నివేదికలో ఈ సంచలన విషయాలు బయటపడ్డాయి. టేబుల్ సాల్ట్, రాక్ సాల్ట్, సీ సాల్ట్, రా సాల్ట్‌తో పాటు ఐదు రకాల చక్కెరలను పరిశీలించగా.. అన్ని శాంపిళ్లలో 0.1 ఎంఎం నుంచి 5 ఎంఎం పరిమాణం కలిగిన మట్టిబెడ్డలు, ఫైబర్, ఫిల్మ్స్ బయటపడ్డాయని నివేదిక వెల్లడించింది. అత్యధికంగా అయోడైజ్‌డ్ ఉప్పులో పలు రకాల ఫైబర్, ఫిల్మ్ మైక్రోప్లాస్టిక్స్ కనిపించాయని తెలిపింది. ఒక కిలో ఉప్పులో 6.71 నుంచి 89.15 మైక్రోప్లాస్టిక్ ముక్కలు ఉంటున్నాయని వివరించింది. ఆర్గానిక్ ఉప్పులో అత్యల్పంగా 6.70 మైక్రోప్లాస్టిక్ ముక్కలు, అత్యధికంగా అయోడైజ్‌డ్ ఉప్పులో 89.15 మైక్రోప్లాస్టిక్ ముక్కలు ఉన్నట్టు పేర్కొన్నది.

3000 అడుగుల ఎత్తయిన బ్యాటరీ

న్యూయార్క్: విద్యుత్తు నిల్వలో ఉన్న సవాళ్లను అధిగమించేందుకు ఆకాశహర్మ్యాల లాంటి బ్యాటరీలు నిర్మించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇవి ప్రపంచంలోనే ఎత్తైన నిర్మాణాలుగా మారనున్నాయి. ఇందుకోసం బుర్జ్ ఖలీఫా, వన్ వరల్డ్ ట్రేడ్ వంటి నిర్మాణాలను డిజైన్ చేసిన స్కిడ్‌మోర్, ఓవింగ్స్ అండ్ మెర్రిల్(ఎస్‌ఓఎం), విద్యుత్తు నిల్వ సంస్థ అయిన ఎనర్జీ వాల్ట్ అనే సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ రెండు సంస్థలు కలిసి భారీ బ్యాటరీ బ్లాకులతో కూడిన ఆకాశహర్మ్యాలను నిర్మించనున్నాయి. వీటి ఎత్తు 985 అడుగుల నుంచి 3,300 అడుగుల వరకు ఉండనుంది. వీటిల్లో పునరుత్పాదక విద్యుత్తును నిల్వ చేస్తారు. విద్యుత్తు డిమాండ్ పెరిగినప్పుడు ఈ బ్యాటరీల నుంచి సరఫరా చేస్తారు. డిమాండ్ తగ్గినప్పుడు ఉత్పత్తయ్యే విద్యుత్తును వీటిల్లో నిల్వ చేస్తారు. ఎనర్జీ వాల్ట్ సంస్థ ఇప్పటికే చైనాలో 492 అడుగుల ఎత్తైన విద్యుత్తు నిల్వ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు ప్రపంచంలో ఎత్తైన భవనంగా బుర్జ్ ఖలీఫా(2,717 అడుగులు) ఉంది.

ఐఐటీ మండిలో పునర్జన్మపై కోర్సు

మండి, ఆగస్టు 13: విద్యార్థులందరూ భగవద్గీత, పునర్జన్మ వంటి అంశాలను నేర్చుకోవాల్సిందే అంటూ ఐఐటీ మండి తీసుకున్న నిర్ణయంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం 'వివేకం, శ్రేయస్సు పరిచయం' పేరుతో ఓ కోర్సును ఐఐటీ మండి చేర్చింది. నూతనంగా ప్రారంభించిన ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్(ఐకేఎస్) విభాగం ఈ కోర్సును అందిస్తున్నది. ఇందులో సూక్ష్మ శరీరం, పునర్జన్మ, మరణానికి చేరువ, వంటి పలు అంశాలు ఉన్నాయి. దీంతో పాటు ప్రతి వారం విద్యార్థులంతా భగవద్గీత పారాయణం, యోగా తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించింది. విద్యార్థుల హాజరును కూడా నమోదు చేస్తున్నది. ఐఐటీ మండి తీసుకున్న ఈ నిర్ణయాలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇది విద్యార్థులపై మతపరమైన ఆచారాలను రుద్దే ప్రయత్నమని పలువురు విమర్శిస్తున్నారు. 2022లో కొత్త డైరెక్టర్ వచ్చినప్పటి నుంచి ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

యువతిపై ర్యాపిడో డ్రైవర్ అత్యాచారం

అస్సాంలో ఘటన

గువాహటి: లిఫ్ట్ ఇస్తానని చెప్పి ర్యాపిడో డ్రైవర్ ఒకరు యువతిపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన అస్సాంలో చోటుచేసుకుంది. ఉపాధి కోసం గువాహటికి వచ్చిన యువతి ఉద్యోగం కోసం మాలిగావ్‌లో ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ క్రమంలో ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఫకీర్‌ఖాన్ ఆమె దగ్గరకు వెళ్లి లిఫ్ట్ ఇస్తానని, ఉద్యోగం ఇప్పించడంలో సాయం చేస్తానని ఆమెను నమ్మించాడు. తర్వాత ఆమెను కామాఖ్య రైల్వేస్టేషన్ దగ్గరలోని ఒక నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్లి లైంగికదాడి చేశాడు. గాయపడిన ఆమెను ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్ వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఇద్దరు రోగులపై డాక్టర్ లైంగిక దాడి

చితకబాదిన బంధువులు..

ఒడిశాలో ఘటన

కటక్: చికిత్స కోసం వచ్చిన ఇద్దరు రోగులపై ఒడిశాలోని ఒక డాక్టర్ లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ ఘటన కటక్‌లోని ప్రముఖ ఎస్సీబీ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో ఈ నెల 11న చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఈసీజీ తీయించుకోవడానికి ఇద్దరు మహిళలు కార్డియో విభాగానికి రాగా, డ్యూటీలో ఉన్న ఒక డాక్టర్ వారిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో వారు తమ బంధువులకు తెలుపగా, వారు అతడికి దేహశుద్ధి చేశారు. తీవ్రంగా గాయపడిన డాక్టర్‌ను ఐసీయూకు తరలించారు.

అంగారకుడిపై నీరు

న్యూయార్క్, ఆగస్టు 13: అంగారక గ్రహంపై నివాసయోగ్యతను గుర్తించేందుకు జరుగుతున్న పరిశోధనల్లో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. జీవుల మనుగడకు కీలకమైన నీటిజాడలను అంగారకగర్భంలో పరిశోధకులు గుర్తించారు. ఈ గ్రహం ఉపరితలానికి 20 కిలోమీటర్ల లోతులో నీటి జాడలు ఉన్నట్టు నాసాకు చెందిన మార్స్ ఇన్‌సైట్ ల్యాండర్ డాటాలో వెల్లడైంది. ఈ ల్యాండర్‌ను 2018లో అంగారక గ్రహంపైకి పంపారు. నాలుగేండ్లుగా ఇది అక్కడి సిస్మిక్ డాటాను నమోదు చేస్తున్నది. ఈ డాటాను పరిశీలించిన పరిశోధకులు.. అంగారక ఉపరితలం నుంచి 11.5 కిలోమీటర్ల నుంచి 20 కిలోమీటర్ల లోతు వరకు నీటి జాడలు ఉన్నట్టు భావిస్తున్నారు. ఉపరితలం నుంచి లోపలికి నీరు వెళ్లి ఇంకిపోయి ఉండొచ్చని పరిశోధకులు తెలిపారు.

మొండి సైనసైటిస్‌తో ఫంగల్ ఇన్ఫెక్షన్లు

న్యూఢిల్లీ: ఎంతకీ నయం కాని సైనసైటిస్ కారణంగా ఫంగల్ ఇన్ఫెక్షన్లు, ప్రాణాంతక సమస్యలు వచ్చే ముప్పు ఉంటుందని ఢిల్లీలోని సర్ గంగారామ్ హాస్పిటల్ వైద్యులు గుర్తించారు. ఇటీవల ఓ 27 ఏండ్ల వైద్యుడికి ఇదే సమస్య ఎదురైంది. మూడు నెలలుగా అతడికి కుడివైపు ముక్కు మూసుకుపోయింది. తర్వాత ఆయన కుడి కన్ను చూపు కోల్పోయాడు. సీటీ స్కాన్ తీయగా అతడు నాసల్ పాలిపోసిస్, ఫంగల్ సైనసైటిస్‌తో బాధ పడుతున్నాడని, దీని వల్ల కంటి నరంపై ఒత్తిడి కలుగుతోందని తేలింది. ఫంగస్ అన్ని సైనస్‌లకు వ్యాపించిందని గుర్తించారు. సర్జరీ చేయడంతో కంటిచూపు తిరిగి వచ్చింది.

బెయిల్ నిబంధన.. జైలు మినహాయింపు

ఉపా చట్టానికీ వర్తిస్తుంది

బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 13: 'బెయిల్ అనేది నిబంధన.. జైలు అనేది మినహాయింపు' అనే సూత్రం ఉపా చట్టం కింద నమోదైన కేసులకూ వర్తిస్తుందని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొన్నది. ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన కేసులో నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'బెయిల్ మంజూరు చేసే అవకాశం ఉన్న కేసు వచ్చినప్పుడు బెయిల్ ఇవ్వడానికి కోర్టు వెనకాడకూడదు. ప్రాసిక్యూషన్ ఆరోపణలు తీవ్రమైనవే అయినప్పటికీ చట్ట ప్రకారం బెయిల్ మంజూరు కోసం దాఖలైన కేసును పరిగణనలోకి తీసుకోవడం కోర్టు బాధ్యత. బెయిల్ ఒక నిబంధన.. జైలు మినహాయింపు అనేది నిర్దిష్ట సూత్రం. అర్హత ఉన్న కేసుల్లోనూ కోర్టులు బెయిల్‌ను తిరస్కరించడం ప్రారంభిస్తే, అది రాజ్యాంగంలోని 21వ అధికరణాన్ని ఉల్లంఘించడమే అవుతుంది' అని పేర్కొన్నది.

నిందితుడికి బెయిల్ మంజూరు

ఎన్ఐఏ 2022లో అరెస్టు చేసిన పాట్నాకు చెందిన రిటైర్డ్ పోలీస్ కానిస్టేబుల్ జలాలుద్దిన్ ఖాన్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. నిషేధిత పీఎఫ్ఐ సభ్యులకు ఇంటిని అద్దెకు ఇచ్చి, ఉగ్ర కార్యకలాపాల్లో పాలుపంచుకున్నాడని ఎన్ఐఏ ఆరోపించింది. అయితే, ఉపా చట్టంలో పేర్కొన్న చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో జలాలుద్దిన్ ఖాన్ పాల్గొన్నట్టు చార్జ్‌షీట్‌లో ఏమీ లేదని కోర్టు పేర్కొన్నది.

వెల్లుల్లి.. కూరగాయా? మసాలా దినుసా?

ఏండ్ల వివాదానికి తెరదించిన మధ్యప్రదేశ్ హైకోర్టు

న్యూఢిల్లీ: వెల్లుల్లి.. ఇది లేకుండా మసాలా లేదు.. ఇది లేని వంట లేదు అంటే అతిశయోక్తి కాదు. ఇంతకీ వెల్లుల్లి మసాలా దినుసా, లేక కూరగాయా? అంటూ ఏళ్ల తరబడి సాగుతున్న వివాదానికి తెరదించుతూ మధ్యప్రదేశ్ హైకోర్టు వెల్లిగడ్డను కూరగాయ కిందే ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. అయితే దీనిని అటు మసాలా, ఇటు కూరగాయల మార్కెట్లలో అమ్మకాలు జరపవచ్చునంటూ తీర్పులో పేర్కొంది. వెల్లుల్లికి ఉన్న ఘాటు లక్షణంతో పాటు దానిని మసాలాల్లో తప్పక వినియోగిస్తారు కాబట్టి దానిని అందరూ మసాలా దినుసు కిందే భావిస్తుండే వారు. అయితే 2015లో మధ్యప్రదేశ్‌లోని రైతులు అది కూరగాయా? మసాలా అన్న విషయం తేలక న్యాయస్థానాలను ఆశ్రయించారు. అయితే కింది కోర్టుల్లో విభిన్న తీర్పులు రావడంతో వ్యాపారులు ఏ నిర్ణయానికీ రాలేకపోయారు. ఈ వివాదానికి ఎట్టకేలకు హైకోర్టు తీర్పుతో తెరపడింది.

వైద్యురాలిపై హత్యాచారం కేసు | సీబీఐకి

- పోలీసులకు కలకత్తా హైకోర్టు ఆదేశాలు
- బాధితురాలి కండ్లు, జననాంగాల్లో రక్తస్రావం
- పోస్టుమార్టం నివేదికలో షాకింగ్ విషయాలు

కోల్‌కతా, ఆగస్టు 13: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం కేసు దర్యాప్తును కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐకి బదిలీ చేయాలని కలకత్తా హైకోర్టు మంగళవారం ఆదేశించింది. ఘటన జరిగి ఐదు రోజులు అయినప్పటికీ, దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నది. కేసు డైరీని సాయంత్రంలోగా, ఇతర డాక్యుమెంట్లను బుధవారం ఉదయం 10 గంటల్లోగా సీబీఐకి అప్పగించాలని ఆదేశించింది. విధుల బహిష్కరణను విరమించుకోవాలని రాష్ట్రంలో ఆందోళనలు చేస్తున్న వైద్యులను చీఫ్ జస్టిస్ శివజ్ఞానం నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం కోరింది. కాగా, కేంద్రమంత్రి నడ్డా తమ డిమాండ్లకు అంగీకరించడంతో నిరసనలను విరమిస్తున్నట్టు ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఫోర్డా) ప్రకటించింది.

బాధితురాలిపై క్రూరంగా దాడి

పోస్టుమార్టం నివేదికలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. నిందితుడు బాధితురాలిపై క్రూరమైన దాడికి పాల్పడ్డాడని, ఆమె శరీరంపై పలు చోట్ల గాయాలైనట్టు తేలింది. అదేవిధంగా తనపై లైంగిక దాడిని బాధితురాలు తీవ్రంగా ప్రతిఘటించడంతో పెనుగులాట చోటుచేసుకొన్నట్టు పోస్టుమార్టం నివేదిక చెబుతున్నది. ముఖంపై రక్తపు గాయాలున్నాయని, కండ్లలో నుంచి రక్తస్రావం అయిందని, బాధితురాలి జననాంగాల్లో తీవ్రమైన గాయం అయినట్టు తేలింది. గొంతు నులిమి ఊపిరాడకుండా చేయడంతో బాధితురాలు మరణించినట్టు పోస్టుమార్టం నివేదిక వెల్లడించింది.

ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా కోల్‌కతాలో పౌర సమాజం నిరసన ర్యాలీ

వైద్యుల రక్షణకు పాలసీ రూపొందించండి

మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ సూచనలు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ఇటీవల వైద్యులపై వరుసగా దాడులు జరుగుతున్న నేపథ్యంలో వారి రక్షణకు ప్రత్యేకంగా పాలసీని రూపొందించాలని నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) సూచించింది. ఈ మేరకు అన్ని మెడికల్ కాలేజీలకు ఆదేశాలు జారీ చేసింది. ఓపీ, వార్డులు, క్యాజువాలిటీ, హాస్టళ్లు, క్యాంపస్‌లోని ఇతర ప్రదేశాలు, రెసిడెన్షియల్ క్వార్టర్లలో రక్షణ చర్యలు చేపట్టాలని కోరింది. ఎవరైనా వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించింది. ఈ ఘటనలపై 48 గంటల్లోగా నివేదికను ఎన్ఎంసీకి పంపాలని సూచించింది.

కేజ్రీవాల్ బదులు కైలాశ్ గెహ్లోట్

జెండా ఎగురవేయడానికి నామినేట్ చేసిన ఎల్జీ

ఆతిశీ పేరును తిరస్కరించిన సాధారణ పరిపాలన విభాగం

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీ ప్రభుత్వం ఛత్రసాల్ స్టేడియంలో నిర్వహించే వేడుకలో ఢిల్లీ హోంమంత్రి కైలాశ్ గెహ్లోట్ జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. సీఎం కేజ్రీవాల్ తీహార్ జైలులో ఉండటంతో కైలాశ్ పేరును ఎల్జీ వీకే సక్సేనా నామినేట్ చేశారు. కాగా, ఎవరు జెండా ఎగురవేయాలనే అంశంపై ఆప్, ఢిల్లీ ఎల్జీ మధ్య పేచీ మొదలైంది. తన బదులు విద్యాశాఖ మంత్రి ఆతిశీని జెండా ఎగురవేసేందుకు అనుమతించాలని ఇటీవల ఎల్జీకి కేజ్రీవాల్ జైలు నుంచి లేఖ రాశారు. అయితే, ఈ లేఖ సరైన సమాచార ప్రక్రియ కాదని పేర్కొంటూ కేజ్రీవాల్ విజ్ఞప్తిని సాధారణ పరిపాలన విభాగం పక్కన పెట్టింది. దీంతో హోంమంత్రి కైలాశ్ పేరును ఎల్జీ ప్రతిపాదించారు. జెండా ఎవరు ఎగురవేయాలనే దానికి సంబంధించి నిర్దిష్ట పద్ధతి ఉందని, ఇది పాటించకపోతే ఈ వేడుక పవిత్రత దెబ్బతింటుందని, అందుకే కైలాశ్ జెండా ఎగురవేస్తారని సాధారణ పరిపాలన విభాగం వివరించింది. గెహ్లోట్ ఎంపికను ఆప్ స్వాగతించింది. 'ఎంపికైన' వ్యక్తిని కాకుండా 'ఎన్నికైన' వ్యక్తిని నామినేట్ చేయడం ప్రజాస్వామ్యానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నది.

వీర్య, అండ దాతలకు బిడ్డపై హక్కులుండవు

ముంబై, ఆగస్టు 13: వీర్య, అండ దాతలకు బిడ్డపై చట్టపరమైన హక్కులు ఉండవని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. వారిని పిల్లలకు జీవ సంబంధ(బయలాజికల్) తల్లిదండ్రులుగా చెప్పడం కుదరదని తెలిపింది. తన కవల కూతుళ్లను చూసేందుకు అనుమతించాలని ఓ మహిళ వేసిన కేసు విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తన పిల్లలు అద్దె గర్భం ద్వారా పుట్టారని.. వారు తన భర్త, సోదరితో ఉంటున్నారని పిటిషనర్ కోర్టుకు తెలిపింది. తన సోదరే తనకు అండం దానం చేసిందని.. అయితే ఆమెకే పిల్లలపై చట్టబద్ధ హక్కు ఉంటుందని తన భర్త వాదిస్తున్నాడని కోర్టుకు తెలిపింది. భర్త వాదనను కోర్టు తోసిపుచ్చింది. విభేదాల కారణంగా 2021లో పిటిషనర్ భర్త ఇద్దరు పిల్లలను తీసుకుని వేరే ఇంటికి వెళ్లిపోయాడు. అక్కడ పిల్లల బాగోగులను పిటిషనర్ సోదరి చూసుకుంటుందని అతడు తెలపడంతో పిటిషనర్ స్థానిక కోర్టును ఆశ్రయించారు. అక్కడ ఆమె అభ్యర్థన తిరస్కరణకు గురి కావడంతో హైకోర్టులో కేసు వేశారు.

ఉచితాలకు పైసలుంటయ్.. పరిహారానికి లేవా?

మొదటిపేజీ తరువాయి...

సూటిగా ప్రశ్నించింది. ప్రభుత్వం తీరు ఇలాగే ఉంటే, ఉచిత పథకాలను రద్దు చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

కోర్టు కీలక వ్యాఖ్యలు

- ఎప్పుడో 1963లో తీసుకొన్న భూమికి రూ. 16 లక్షలను ఇప్పుడు పరిహారంగా ఇస్తారా? అది న్యాయమైన పరిహారమేనా? అసలు ఆ భూముల్లో రక్షణ శాఖ నిర్మాణాలను ఎలా అనుమతించారు?
- 'లాడ్లీ బెహనా' (మహిళలకు నెలకు రూ. 1,500 ఆర్థిక సాయం), 'లడ్కా భా' (యువకులకు ఆర్థిక సాయం) వంటి ఉచిత పథకాల కోసం మీ ప్రభుత్వం (షిండే సర్కారు) దగ్గర ఇబ్బడిముబ్బడిగా నిధులు ఉంటాయి. అయితే, బాధితులకు పరిహారం ఇవ్వడానికి డబ్బు లేదా?
- బాధితులకు సరైన పరిహారం చెల్లించకుంటే, ఈ ఉచిత పథకాలను రద్దు చేయాలని మేం ఆదేశాలు ఇస్తాం.
- 1963 నుంచి ఆ భూమి ద్వారా సర్కారు లబ్ధిపొందింది కాబట్టి, నూతన భూ సేకరణ చట్టం ప్రకారం.. ఎంత పరిహారం ఇవ్వాలో మేమే నిర్ణయిస్తాం.
- అలా జరుగొద్దు అనుకొంటే, పరిహారం ఎంత ఇవ్వదలుచుకొన్నారో సీఎంతో చర్చించి ప్రధాన కార్యదర్శి ఓ అంకెతో మా దగ్గరకు రండి. అలసత్వం వహిస్తే అన్ని ఫ్రీస్కీమ్స్‌ను నిలిపేస్తాం.

ఏమిటీ కేసు?

పూర్వీకుల నుంచి వచ్చిన 24 ఎకరాల భూమిని 1963లో మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్నదని, అయితే, దానికి తగిన పరిహారం ఇంకా ఇవ్వలేదని ప్రైవేటు వ్యక్తులు కోర్టులో పిటిషన్ వేశారు. పరిహారం గురించి ఏండ్లుగా అడిగితే, 2004లో మరోచోట కొంత భూమి ఇచ్చారని, అయితే, అది అటవీ భూమి అని కేంద్ర సాధికార కమిటీ తమను బయటకు పంపించివేసిందని పిటిషన్‌లో ఆరోపించారు. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. 1963లో సేకరించిన భూమిలో రక్షణశాఖ నిర్మాణాలు చేపట్టడంపై, బాధితులకు పరిహారాన్ని చెల్లించకపోవడంపై ఇటీవలే మహారాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. బాధితుడికి ఎంత పరిహారం ఇవ్వనున్నారో పూర్తి నివేదికతో రావాలని ఈనెల 7న ఆదేశించింది. అయినప్పటికీ, ప్రభుత్వం ఆ వివరాలను మంగళవారం కోర్టుకు సమర్పించలేదు. దీంతో ఆగ్రహించిన న్యాయస్థానం పై వ్యాఖ్యలు చేసింది.

భార్యను బైక్‌కు కట్టేసి.. ఈడ్చుకెళ్లిన భర్త

రాజస్థాన్‌లో అమానుషం

జైపూర్, ఆగస్టు 13: రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో ఓ వ్యక్తి తన భార్య పట్ల అత్యంత పాశవికంగా ప్రవర్తించాడు. తన బైక్‌కు భార్యను కట్టేసి.. ఊరంతా చూస్తుండగా ఈడ్చుకుంటూ వెళ్లాడు. తన సోదరి ఇంటికి వెళ్తానన్నందుకు ఈ దారుణానికి పాల్పడ్డాడు. నహర్సింఘాపూర్ గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడు ప్రేమారమ్ మేఘ్వాల్(32)ను అరెస్టు చేశామని పాంచౌదీ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సురేంద్ర కుమార్ తెలిపారు. ఘటనకు సంబంధించి వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితురాలు ప్రస్తుతం తన బంధువుల వద్ద ఉందని, ఆమె నుంచి ఫిర్యాదు అందలేదని అన్నారు. మద్యానికి బానిసైన మేఘ్వాల్ తరుచూ భార్యను కొట్టేవాడని స్థానికులు చెప్పారు.

2036 నాటికి 152 కోట్లు

దేశ జనాభాపై కేంద్రం అంచనా.. మెరుగవనున్న లింగ నిష్పత్తి

న్యూఢిల్లీ: జనాభాలో భారతదేశం ఇప్పటికే చైనాను దాటేసి ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్నది. 2036 నాటికి దేశ జనాభా 152.2 కోట్లకు చేరుకుంటుందని కేంద్ర ప్రభుత్వ తాజా నివేదిక వెల్లడించింది. మొత్తం జనాభాలో మహిళల సంఖ్య కొంత మేర పెరగడంతోపాటు లింగ నిష్పత్తి కూడా మెరుగవుతుందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ 'వుమెన్ అండ్ మెన్ ఇన్ ఇండియా-2023' నివేదికలో వెల్లడించింది. 2036 నాటికి జననాల సంఖ్య తగ్గడంతో జనాభాలో 15 ఏండ్ల కన్నా తక్కువ వయసున్న వారి సంఖ్య తగ్గుతుందని, 60 ఏండ్ల పైబడిన వృద్ధుల సంఖ్య పెరుగుతుందని అంచనా వేసింది. దేశంలో చివరి సారిగా 2011లో అధికారింగా జనాభా లెక్కలు నిర్వహించారు. 2021లో మరోసారి జరగాల్సి ఉండగా.. ఆ ప్రక్రియ వాయిదా పడుతూ వస్తున్నది.

మొత్తం జనాభాలో మహిళల సంఖ్య

2036 నాటికి - 48.8% (అంచనా)

2011లో- 48.5%

మెరుగవనున్న లింగ నిష్పత్తి

(1000 మంది పురుషులకు మహిళలు)

2036 నాటికి-952(అంచనా)

2011లో-943

ఐరాస అంచనాల ప్రకారం

ప్రస్తుత దేశ జనాభా-142.5 కోట్లు

రాందేవ్‌పై కోర్టు ధిక్కరణ కేసు మూసివేత

న్యూఢిల్లీ, ఆగస్టు 13: యోగా గురు రాం దేవ్ బాబాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ప్రకటనల ద్వారా అధునాతన వైద్య విధానాన్ని కించపరుస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టించారంటూ సంస్థ వ్యవస్థాపకుడు రాం దేవ్ బాబా, ఎండీ బాలకృష్ణలపై దాఖలైన కేసులో వారిద్దరూ సమర్పించిన క్షమాపణను అంగీకరిస్తున్నట్టు పేర్కొన్న ధర్మాసనం కేసును మూసివేస్తున్నట్టు ప్రకటించింది. ఐఎంఏ ఈ కేసు దాఖలు చేసింది. దీనిపై పతంజలి యాజమాన్యం కోర్టుకు క్షమాపణ చెప్పడమే కాక, ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పింది.

ఈ వారమే ఇరాన్ దాడి చేయొచ్చు

ఇజ్రాయెల్‌కు అమెరికా హెచ్చరిక

వాషింగ్టన్, ఆగస్టు 13: ఇజ్రాయెల్‌పై ఈ వారంలోనే ఇరాన్ లేదా దాని అనుకూల సంస్థలు దాడికి పాల్పడవచ్చని అమెరికా పేర్కొన్నది. ఈ మేరకు వైట్‌హౌజ్ అధికార ప్రతినిధి జాన్ ఎఫ్ కిర్బి కీలక ప్రకటన చేశారు. జూలై 31న టెహ్రాన్‌లో హమాస్ చీఫ్ ఇస్మాయెల్ హనియా హత్య, లెబనాన్‌లో హెజ్బొల్లా సీనియర్ కమాండర్ ఫౌద్ షుక్ర్‌ను ఇజ్రాయెల్ హతమార్చడంతో ఉద్రిక్తతలు పెరిగిన సంగతి తెలిసిందే. తమ భూభాగంలో ఇజ్రాయెల్ సైనిక చర్యకు పాల్పడటంపై ఇరాన్ భగ్గుమంటున్నది. ఈ నేపథ్యంలో అమెరికా, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ వంటి దేశాధినేతలు ఉద్రిక్తతలను చల్లార్చి, ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణకు సహకరించాలని ఇరాన్‌ను కోరినా సానుకూల స్పందన రాలేదు.

టెల్ అవీవ్ లక్ష్యంగా హమాస్ రాకెట్ల దాడి

ఇజ్రాయెల్‌లోని ప్రధాన నగరం టెల్ అవీవ్ లక్ష్యంగా హమాస్ మంగళవారం దాడికి పాల్పడింది. రెండు ఎం90 రాకెట్లను ప్రయోగించింది. అయితే, ఒక రాకెట్ పేలుడు శబ్దం నగరంలో వినిపించిందని, ఎవరికీ గాయాలు కాలేదని స్థానిక మీడియా తెలిపింది. ఇంకో రాకెట్ మాత్రం ఇజ్రాయెల్ భూభాగంలోకి చేరుకోలేదని పేర్కొన్నది. కాగా, మంగళవారం గాజా స్ట్రిప్‌లోని దక్షిణ, మధ్య ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ వైమానికదాడులకు పాల్పడింది. ఈ ఘటనలో 19 మంది పాలస్తీనా ప్రజలు మరణించినట్టు తెలుస్తున్నది.

పుతిన్‌కు ఉక్రెయిన్ పెనుదెబ్బ!

రష్యాలోని కుర్స్క్‌లో 1000 చ.కి.మీ. భూభాగం స్వాధీనం చేసుకున్న కీవ్ బలగాలు

దాడులు పెరుగుతాయని పుతిన్ హెచ్చరిక

కీవ్/మాస్కో, ఆగస్టు 13: ఉక్రెయిన్‌తో గత రెండేండ్లకు పైగా సాగుతున్న యుద్ధంలో రష్యాకు ఊహించని పరిణామాలు ఎదురవుతున్నాయి. రష్యాకు ఉక్రెయిన్‌ను నుంచి ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. యుద్ధం ప్రారంభంలో రష్యా సైనిక చర్య పేరుతో ఉక్రెయిన్ భూభాగంలోకి చొచ్చుకుపోయి దాడులకు పాల్పడగా.. ఇప్పుడు ఉక్రెయిన్ కూడా అదే పంథా తీసుకొన్నది. ఇటీవల రష్యా భూభాగంలోకి ఉక్రెయిన్ బలగాలు వెళ్లాయి. కుర్స్క్ రీజియన్‌లో దాదాపు వెయ్యి చదరపు కిలోమీటర్ల మేర భూభాగాన్ని తమ అధీనంలోకి తీసుకొన్నామని ఉక్రెయిన్ ఆర్మీ చీఫ్ ఒలెస్కాండర్ సిర్స్కీ సోమవారం వెల్లడించారు. సరిహద్దును దాటి రష్యా భూభాగంలోకి చొరబడిన తర్వాత ఉక్రెయిన్ ఆర్మీ చీఫ్ ఈ మేరకు తొలిసారిగా అధికారికంగా స్పందించారు.

మరోవైపు రష్యా భూభాగంలోకి తమ బలగాలు వెళ్లిన అంశాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా ధ్రువీకరించారు. తాము అధీనంలోకి తీసుకొన్న భూభాగంలోని ప్రజలకు మానవతా సా